క్లుప్తంగా

కొండగట్టు ఆలయంలో ఎమ్మెల్యే సత్యం పూజలు



వాహనానికి పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తన నూతన వాహనానికి ప్రత్యేక పూజలు చేయించేందుకు ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామివారిని దర్శించుకుని అనంతరం ఆలయ ప్రాంగణంలో వాహన పూజలు నిర్వహించారు.ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

వెల్గటూర్: మండల కేంద్రానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పొనుగోటి రాంమోహన్‌రావు ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాంమోహన్‌రావుకు అడ్లూరి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు కిషన్‌రావుపేట సత్యనారాయణరావు, కుమ్మరిపల్లి మాజీ సర్పంచ్ ముచ్చర్ల మల్లయ్య పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మేరుగు మురళిగౌడ్, అనుమాల మంజుల తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ నాయకుల చేరిక

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 27వ వార్డు ఇస్లాంపురకు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, నాయకులు బండ శంకర్, అడువాల లక్ష్మణ్, మన్సూర్, నేహాల్, జుల్ఫి తదితరులు పాల్గొన్నారు.

అంజన్న స్వాములకు ముస్లిం భిక్ష



తాట్లావాయిలో దీక్షాపరులతో మహ్మద్‌ఖాన్

రాయికల్: మండలంలోని తాట్లవాయిలో పట్టణానికి చెందిన మహమ్మద్ ఖాన్ అనే ముస్లిం మతసామరస్యానికి ప్రతిగా నిలిచాడు. ఆదివారం అంజన్న దీక్షాపరులకు బిక్ష పెట్టారు. ఈ సందర్భంగా మహమ్మద్‌ఖాన్ ను గ్రామస్తులు అభినందించారు.

హోలీ ప్రశాంతంగా జరుపుకోవాలి



రామకృష్ణ,ఎస్సై

పెగడపల్లి: మండలంలో హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై రామకృష్ణ మండల ప్రజలు, యువతకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో సాంప్రదాయ పద్ధతిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించుకోవాలన్నారు. యువత మద్యం సేవించి వాహనాలు నడిపితే నేరమని డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ రైడ్ డ్రైవింగ్ చేస్తూ దొరికితే వాహనం స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994 -95 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సామల్ల లావణ్యవేణు, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి, నాయకులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కల్లెడ- గుట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య నిర్మించిన బ్రిడ్జి



బ్రిడ్జికు ఇరువైపులా నిర్మించని అప్రోచ్ రోడ్డు

బ్రిడ్జి నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు..

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ- గుట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య అనంతారం వాగుపై రూ.12 కోట్లతో ఇటీవల నూతనంగా బ్రిడ్జి నిర్మించారు. కానీ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో చుట్టు పక్క గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మించినప్పటికి ఓ వైపు బ్రిడ్జికు సరైన సిమెంట్ పనులు చేయకపోవడంతో పాటు బ్రిడ్జిని కలిపేలా అనంతారం వైపు, కల్లెడ వైపు రోడ్లు ఏర్పాటు చేయలేదు. బ్రిడ్జి నిర్మించడానికి ఏళ్లు పట్టింది, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మరెన్ని ఏళ్లు పడతాయో నని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే బ్రిడ్జి వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



నిలిచిపోయిన ఐసీడీఎస్ భవన నిర్మాణం

పిల్లర్ల స్థాయిలో ఐసీడీఎస్ భవనం

మల్యాల: మండలంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశ మందిరంతో పాటు సీడీపీఓ కార్యాలయ నిర్మాణానికి పనులు ప్రారంభించి, ఆరేళ్లు గడుస్తున్నా నేటికి పిల్లర్ల స్థాయిలోనే పనులు నిలిచిపోయాయి. సీడీపీవో కార్యాలయంతోపాటు, గోడౌన్ నిర్మాణం చేపట్టాలని రూ.35 లక్షల అంచనా వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. కానీ ఇప్పటివరకు నిర్మాణం పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో సమావేశాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని అంగన్‌వాడీ టీచర్లు కోరుతున్నారు.

పల్లెలపై సైబర్ నేరగాళ్ల వల

- అమాయకులే లక్ష్యంగా మోసాలు
- మండలంలో మూడు నెలల్లోనే రూ.6 లక్షలు టోకరా



సైబర్ మోసాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కథలాపూర్: పట్టణ ప్రాంతాలకే పరిమితమనుకున్న సైబర్ మోసాలు.. ఇప్పుడు పల్లెలకు పాకాయి. అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, లాటరీ తగిలిందని ఫోన్ చేస్తూ.. నమ్మించి ఖాతాల్లోని డబ్బులు మాయం చేస్తున్నారు. ఇలా కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు సైబర్ ఉచ్చులో పడ్డారు. ఈ ఏడాది మూడు నెలల్లోనే బాధితులు సుమారు రూ.6 లక్షల వరకు పోగొట్టుకున్నారు. ఇంకా బయటకు చెప్పుకోలేనివి ఎన్ని ఉంటాయోనని సందేహాలు నెలకొన్నాయి.

జాగ్రత్తలు పాటించి.. 1930 నంబర్‌కు ఫోన్ చేస్తే మేలు

అనుమానాస్పద వ్యక్తులు చేసే ఫోన్‌లకు స్పందించవద్దు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ నెంబర్లు కొత్త వ్యక్తులకు చెప్పవద్దు. మెయిల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దు. సోషల్ మీడియాలో కనిపించే అప్లికేషన్లు ఫోన్‌లతో డౌన్‌లోడ్ చేసుకోవద్దు. అనుకోకుండా సైబర్ మోసానికి గురైతే 1930 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం అందించాలి. బ్యాంక్ అధికారులకు వెంటనే సమాచారం అందిస్తే వారు ఖాతాను ఫ్రీజ్ చేస్తారు. త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే పోయిన డబ్బును వెనక్కి రప్పించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు



సైబర్ నేరాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అనుమానాస్పద వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు కొత్త వ్యక్తులకు చెప్పవద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలకు గురైన వారు తక్షణమే 1930 నెంబర్‌కి ఫోన్‌చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

– నవీన్‌కుమార్, ఎస్సై, కథలాపూర్

పోషక లోపాలకు చెక్



మద్దులపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

పెగడపల్లి: చిన్నారులకు పోషక గుణాలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుని బాలామృతం ప్లస్‌ను పంపిణీ చేస్తోంది. గతంలో 2.4 కిలోల బాలమృతం ప్యాకెట్‌ను నెలకు ఒక్కోటి ఇవ్వగా, 1.25కిలోల బాలామృతం ప్లస్ ప్యాకెట్లు రెండింటిని అందిస్తున్నారు. అంగన్‌వాడి కేంద్రంలో నమోదైన చిన్నారుల ఆరోగ్య స్థితిని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అందులో భాగంగా వారి బరువు, ఎదుగుదలను క్రమం తప్పకుండా నమోదు చేస్తున్నారు. ఈ రికార్డుల ఆధారంగా కొందరు చిన్నారులు తీవ్ర పోషక లోపాల బారిన పడినట్లు గుర్తిస్తున్నారు. ఇలాంటి వారికి సాధారణ ఆహారంతో పాటు అధిక పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలని రాష్ట్ర మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ టీఎస్‌ఫుడ్స్ యూనిసెఫ్ అధికారులు ప్రత్యేకంగా బాలామృతం ప్లస్‌ను తయారు చేశారు.

బాలామృతంలో ప్లస్‌లో..

పాలపొడి, పల్లినూనె, రైస్, గోధుమ పిండి, శనగపప్పు, చెక్కరతో పాటు కొవ్వు పదార్థాలు, విటమిన్స్, క్యాల్షియం, ఐరన్ పోలిక్ యాసిడ్, లియాసిస్, జింక్ సమృద్ధిగా ఉండే మిశ్రమాలతో బాలామృతం ప్లస్ తయారు చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేసేందుకు వీటిని ప్రభుత్వం తయారు చేసి సరఫరా చేస్తోంది.

మల్యాల ప్రాజెక్టు పరిధిలో ..

అంగన్‌వాడీ కేంద్రాలు 227, 7 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు 1039, మూడేళ్లలోపు పిల్లలు 4785, ఆరేళ్లలోపు పిల్లలు 4937, గర్భిణులు 1357, బాలింతలు 1507 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంతో మేలు జరుగనుంది.

కేతమ్మ ఆలయంలో బోనాలు

రాయికల్: మండలంలోని కట్కాపూర్ వెన్నముద్దల గండిలో గొల్ల కేతమ్మ మల్లికార్జున స్వామి పట్నాలు ఆదివారం ప్రారంభమయ్యాయి మల్లికార్జున స్వామి ఆలయంలో పట్నం వేశారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కట్కాపూర్ రంగసాగర్ కండ్లపల్లి మంగెల యాదవ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లోని మాతృశ్రీ విద్యామందిర్ పాఠశాల 21 వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, వేసిన నాటికలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలువురు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరకుంటారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్,స్థానిక నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యంపేటలో మద్యం పట్టివేత

మల్యాల: మండలంలోని ముత్యంపేట దిగువ కొండగట్టు ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఎస్సై కుమారస్వామి ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, అక్రమంగా మద్యం నిల్వ చేశారనే పక్కా సమాచారం మేరకు ముత్యంపేటలోని దిగువ కొండగట్టులో ఎం డీ.తాజొద్దీన్ వద్ద రూ.3,275 విలువైన 8 లీటర్ల 70 ఎం.ఎల్ మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. తాజొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జగిత్యాల క్లబ్ కార్యదర్శిగా పుప్పాల అశోక్



అశోక్

జగిత్యాలటౌన్: జగిత్యాల క్లబ్ కార్యదర్శిగా ప్రముఖ న్యాయవాది, మాజీ కౌన్సిలర్ పుప్పాల అశోక్ ఘన విజయం సాధించారు. జగిత్యాల క్లబ్ కార్యదర్శి పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో నలుగురు పోటీపడగా హోరాహోరీగా జరిగిన పోటీలో 53 ఓట్ల మెజారిటీతో పుప్పాల అశోక్ గెలుపొందారు. మిగతా పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

మెట్‌పల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంఘం జగిత్యాల జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆదివారం శ్రీనివాస్‌కు అందజేశారు. శ్రీనివాస్ నియామకం పట్ల పలువురు అభినందించారు.కార్యక్రమంలో శంకర్, శిరీష్, శ్రీకాంత్, సదానందం, ప్రతాప్,అజయ్,సురేశ్, శివ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా రవి



రవి

రాయికల్: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కూరగాయల రవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల కమిటీ సభ్యులు ఎలుగందుల సత్యనారాయణ, గంప ఆనందం, చింత అశోక్. శ్రీకర్ తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సంఘ పటిష్టత కోసం కృషి చేస్తాన్నారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

రాయికల్: పట్టణంలోని భవానినగర్ కాలనీ అధ్యక్షుడిగా చౌడారపు లక్ష్మినారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎనగందుల లింగంగౌడ్, కార్యదర్శిగా పారిపెల్లి బాలకృష్ణ, కోశాధికారిగా సింగని రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా గంపఆనందం, బుచ్చన్న, రఫీ, శోభారాణి, నవీన్, రాజారెడ్డి, నారాయణలను ఆదివారం కాలనీవాసులు ఎన్నుకున్నారు.

పట్టణంలో ముందస్తు హోలీ వేడుకలు



కోరుట్ల: పట్టణంలో పలువురు యువకులు, మహిళలు, పిల్లలు ఆదివారం ముందస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. సెలవు రోజు కావటంతో ఒకరికొకరు రంగులు చల్లుకొని ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.

మట్టలతో ప్రదర్శన



మట్టలతో ప్రదర్శనగా వెళ్తున్న క్రైస్తవులు

జగిత్యాలటౌన్: పట్టణంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్రైస్తవ మందిరాలు కిక్కిరిసిపోయాయి. క్రైస్తవ సోదరులు మట్టలతో భక్తి గీతాలు ఆలపిస్తూ మిషన్ కాంపౌండ్ చుట్టూ ఊరేగింపుగా తిరిగారు. అనంతరం ఆలయ గురువు జీవరత్నం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పరిసల ప్రాంతాల భక్తులుల పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చర్చి ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది.

ఆధ్యాత్మికం

లక్ష్మీనారాయణ స్వామికి సువర్ణ పుష్పార్చన



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అష్ట లక్ష్మీ సహిత లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం రాత్రి ఉత్సవ మూర్తులకు మంత్రహవనం, సువర్ణ పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మంత్రహవనం, హోమం,ప్రత్యేక పూజలు నిర్వమించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బూరుగు రామస్వామి గౌడ్,అర్చకులు సముద్రాల శ్రీ రామాచార్యులు,ఇందుర్తి మధుసుదనాచారి, శ్రీనివాసాచార్యులు, శివ కుమారాచార్యులు, మాధవాచార్యులు, శ్రీకాంతాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో 37వ వార్షికోత్సవ సంబరాలు ఆదివారం నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామదేవతల ప్రతిష్ఠాపనోత్సవాలు

సారంగాపూర్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల ఆలయాల్లో సోమవారం నుండి ప్రతిష్టాపనోత్సవాలు జరగనున్నాయి. శ్రీ మహాలక్ష్మీ సమేత, సారగమ్మ, బంగారు పోచమ్మ, ముత్యాల పోచమ్మ అమ్మవార్ల ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 27 వరకు ప్రాణప్రతిష్ఠ మహోత్సవం, అనంతరం అన్నదానం, 28న బోనాలు వటి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు చింతలూర్‌లో వేణుగోపాల స్వామి కల్యాణం

రాయికల్: మండలంలోని చింతలూర్‌లో సోమవారం వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు చెరుకుమహేశ్వర శర్మ, మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి కలశ స్నానం చేయిస్తున్న అర్చకులు

జగిత్యాలటౌన్: శ్రీ అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీమాన్ నంబి వేణుగోపాల చార్య కౌశిక ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారికి నవ కలశ స్నానం పంచహారతి, నిత్యహోమం జరిపించిన అనంతరం ఊయలలో ప్రతిష్ఠించి నవ కలశ స్నపణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డాక్టర్ శశికుమార్, డా వందన,తవుటు రాంచంద్రం పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వేంకటేశ్వరుని సన్నిధిలో ప్రభుత్వ విప్ పూజలు



అర్చకుల ఆశీర్వాదం తీసుకుంటున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

మేడిపల్లి: భీమారం మండలం గోవిందరం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ హరిచరన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, భీమారం మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామిని బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా సత్యం పాల్గొన్నారు.

టోర్నీ విజేతలకు బహుమతులు పంపిణీ

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ టోర్నీలో విజేతగా ఇప్పపెల్లి జట్టు, రన్నరప్‌గా కథలాపూర్ జట్టు నిలిచింది. విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి క్రీడాకారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముంబాయి థానే ఆర్‌పీఐ అధ్యక్షుడు మహేంద్ర గైక్వాడ్, బీవండి ఉపాధ్యక్షుడు పెయింటియా పాయకరావు, మార్గం గోపి, మండల నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బొమ్మెన

కథలాపూర్: మండలంలోని దుంపేటలో బాలరాజ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా బొమ్మెన జట్టు నిలిచింది. ఆదివారం ఎస్సై నవీన్‌కుమార్ విజేత జట్టుకు జ్ఞాపికలు, నగదు రూ. 10 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. రన్నరప్‌గా నిలిచిన దుంపేట జట్టుకు జ్ఞాపిక తోపాటు రూ. 5 వేలు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేశ్, స్పాన్సర్లు హరీశ్, నవదీప్, వంశీ, క్రీడాకారులు పాల్గొన్నారు.